విశాలాంధ్ర ప్రాంతీయం
గుంటూరు, బాపట్ల, పల్నాడు

విజ్ఞానాభివృద్ధికి విద్యార్థులు కష్టపడాలి

విశాలాంధ్ర-గుంటూరు : గ్లోబలీకరణ నేపథ్యంలో విజ్ఞానం అనంతంగా పెరిగిందని, విద్యార్థులు తరగతి పుస్తకాలతో పాటు పోటీ పరీక్షలకు పనికొచ్చే అన్ని రకాల మాధ్యమాలను ఉపయోగించుకోని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సీఐడీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కేజీవీ సరిత అన్నారు. స్థానిక నగరంపాలెం ఎస్‌వీఎస్ఆర్ రెడ్డి బాలుర వసతి గృహంలో బండి సాహితీ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ నిర్మించిన భవనంలో కంప్యూటర్ ల్యాబ్‌ను ఆదివారం ఆమె ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్పీ సరిత మాట్లాడుతూ తమ బిడ్డ పోయిన దుఃఖాన్ని దిగమింగుకొని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అశోక్ రెడ్డి సుధావాణి దంపతులు గుంటూరు నగరంతో పాటు గ్రామీణ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఇతోధికంగా చేయూతను అందించటం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో హాస్టల్ పాలకవర్గ అధ్యక్షులు చల్లా అంజిరెడ్డి, కె.సంజీవరెడ్డి, నగర కార్పొరేటర్లు శ్రీనివాసరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, ఏపీ టెక్స్‌టైల్ ఫెడరేషన్ అధ్యక్షులు బూసిరెడ్డి మల్లేశ్వర రెడ్డి, ప్రొఫెసర్ షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో శివాలయం సందడి

విశాలాంధ్ర-పెదకాకాని : మండల కేంద్రమైన పెదకాకానిలోని శివాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచే సుదూర ప్రాంతాల నుంచి ఆలయానికి తరలివచ్చి కార్తీకదీపాలు వెలిగించి స్వామివారిని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయాధికారి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

లోకేష్‌తో టీఎన్‌టీయూసీ సభ్యుల భేటీ

విశాలాంధ్ర-తాడేపల్లి : మంగళగిరి నియోజకవర్గ టీఎన్‌టీయూసీ కార్యవర్గ సభ్యులు ఆదివారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ నారా లోకేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ వనియోజకవర్గంలో తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్‌ను కార్మికులకు మరింత చేరువలోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యవర్గ సభ్యులు కష్టపడి పనిచేయాలని, అందుకు కావలసిన సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. కార్మికరంగాన్ని ప్రోత్సహించడంలో మంగళగిరి నియోజకవర్గం మార్గదర్శకంగా నిలవాలని అందుకు కావలసిన ప్రణాళికను, విధివిధానాలను రూపొందించుకోవాలని కార్యవర్గ సభ్యులకు ఆదేశించారు.

ఇళ్ల కూల్చివేతలు సరికాదు

విశాలాంధ్ర-తాడేపల్లి : తాము అధికారంలోకి వస్తే అందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న ఇళ్లు కూల్చివేస్తుందని తక్షణమే దీన్ని ఉపసంహరించుకోవాలని గుంటూరు పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఉండవల్లి టీడీపీ అధ్యక్షులు గాదె శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం బాదుడే బాదుడు కార్యక్రమాన్ని ఉండవల్లి అంబేద్కర్ నగర్‌లో నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. మంగళగిరి-విజయవాడ పాత జాతీయ రహదారిపై శర్మ దాబా దగ్గర నుంచి నులకపేట వరకు గతంలో చిరువ్యాపారుల షాపులు, ఇళ్లు కూల్చి ఏం సాధించారని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, గుంటూరు పార్లమెంటు తెలుగు రైతు అధ్యక్షులు కళ్ళం రాజశేఖరరెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దొప్పలపూడి జ్యోతిబసు, కె.రమేష్, వి.శంకర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్న క్యాంటీన్

విశాలాంధ్ర-తాడేపల్లి : నులకపేటలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ వద్ద ఆదివారం ప్రజలకు 78వ రోజు భోజనం అందజేశారు. మారుతి ఫౌండేషన్ అధినేత, టీడీపీ మాజీ అధ్యక్షులు జంగాల సాంబశివరావు (ఉండవల్లి) వారి సహకారంతో భోజనం అందజేశారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న తెలుగు యువత గుంటూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్ మాట్లాడుతూ నిరుపేదలకు పట్టెడన్నం పెట్టేందుకు లోకేష్ ఆదేశాలతో అన్న క్యాంటీన్‌లో భోజనం అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దొప్పలపూడి జ్యోతి బస్, మైనార్టీ సెల్ మంగళగిరి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి షేక్ నాగుల్ మీరా, నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు లీలా కృష్ణ, శ్రీను, ఈశ్వర్ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు ధ్వంసం

విశాలాంధ్ర-తాడికొండ : ఇటీవల వివిధ కేసులలో పట్టుబడిన రూ.65 వేల విలువచేసే 630 మద్యం బాటిళ్లను తాడికొండ కొండ వెనక ప్రొక్లెయిన్‌తో ధ్వంసం చేశారు. జిల్లా అధికా రుల ఆదేశాలతో వాటిని ధ్వంసం చేసినట్లు తుళ్లూరు డీఎస్పీ నాగరాజు తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ హెచ్చరించారు. స్థానిక సీఐ జి.శ్రీనివాసరావు, ఎస్సైలు వి.నరసింహ, నాగార్జున, స్టేషన్ సిబ్బంది, వీఆర్వో మాల్యాద్రి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-మేడికొండూరు : భీమినేనివారిపాలెం గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. మేడికొండూరు సీఐ అల్తాఫ్ హుస్సేన్ సమాచారం మేరకు కొండపాటూరు గ్రామానికి చెందిన కొమ్మారి రత్నాకర్(53) ఇటీవల తన అత్తమామల గ్రామమైన మేడికొండూరుకు వచ్చారు. ఆదివారం ఉదయం రత్నాకర్ తన బావమరిదిని సత్తెనపల్లి రైల్వేస్టేషన్ వద్ద దింపి తన ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణంలో భీమినేనివారిపాలెం గ్రామం వాటర్ ట్యాంక్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి వస్తున్న పత్తిలోడు ట్రాక్టర్ వెనుక భాగంలో బోరాలు తగిలి కింద పడగా ట్రాక్టర్ ట్రాలీ టైరు కొమ్మారి రత్నాకర్ కాలిపై నుంచి వెళ్లడంతో కాలికి బలమైన గాయం అయింది. తీవ్రంగా గాయపడిన రత్నాకర్‌ను స్థానికులు 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. భార్య లక్ష్మీ ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు ఆలయం మూసివేత

విశాలాంధ్ర-దుర్గి : ప్రసిద్ధి గాంచిన అడిగొప్పుల శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయం చంద్ర గ్రహణం పురస్కరించుకుని మంగళవారం 8 గంటలకు ఆలయం మూసివేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీ గిరిరాజ్ నరసింహబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం ఆలయ శుద్ధి అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తారన్నారు.

ఇప్పటం కూల్చివేతలపై చర్చకు సిద్ధమా..?

విశాలాంధ్ర-గుంటూరు : కూల్చివేతలతో మొదలైన జగన్ రెడ్డి ప్రభుత్వ దాష్టీకాలు పరాకాష్టకు చేరాయని.. ఎన్నికలు ఎప్పుడు జరిగిన ఈ దుర్మార్గపు ప్రభుత్వాన్ని తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. ఇప్పటం గ్రామంలో ఇల్లు కూల్చివేతలపై మంత్రులు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని... దమ్ముంటే కూల్చివేతలపై చర్చకు రావాలని మంత్రులు జోగి రమేష్, అంబటి రాంబాబు, రోజాకు సవాల్ విసిరారు. పోలీసులను అడ్డుపెట్టి పవన్ కళ్యాణ్‌ను అడ్డుకోవాలని చూస్తే ఏం జరిగిందో ప్రజలు చూశారని అన్నారు. గుంటూరులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ జోగి రమేష్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని లేకుంటే జనసైనికులు బుద్ధి చెప్తారని హెచ్చరించారు. స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను తొలగించి.. వైఎస్ విగ్రహం చుట్టు కంచె వేసి పోలీసుల పహారా పెట్టారని అన్నారు. నిసిగ్గుగా మంత్రులు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, 120 అడుగుల రోడ్డు ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోనే లేదని... పోనీ రాష్ట్రంలో ఏ గ్రామంలోనైనా 120 అడుగుల రోడ్డు ఉంటే చూపించాలని డిమాండ్ చేశారు. పోలవరం గురించి మాట్లాడడం చేతగాని అరగంట మంత్రి ఇప్పటం గురించి కేకలు పెడుతు

మంత్రులకు గాదె సవాల్

న్నాడని... పవన్ కళ్యాణ్ సభకు స్థలం ఇస్తే నేరం చేసినట్లు మంత్రులు మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. సొంత నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించలేని రోజా ఇప్పటం విషయంలో తగుదునమ్మ అంటూ ఎగేసుకొని వచ్చిందని... ఇప్పటం గ్రామానికి దారేటో తెలుసా రోజా అంటూ ఎద్దేవా చేశారు. అక్రమాలు, అవినీతి నగరి మొత్తం కోడై కూస్తున్న అది మరచి పవన్ కళ్యాణ్‌ని విమర్శించడం నీ స్థాయి ఏంటో తెలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అడపా మాణిక్యాలరావు, బిట్రగుంట మల్లికా, నారదాసు రామచంద్ర ప్రసాద్, ఆళ్ళ హరి, త్రినాథ్ మధు లాల్, గంగారాజు, దాసరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మానవాభివృద్ధిలో యునెస్కో క్లబ్బుల సేవలు గణనీయం

విశాలాంధ్ర-గుంటూరు : ప్రపంచ దేశాల ప్రజల విద్య సామాజిక శాస్త్రీయ అభివృద్ధి కోసం ఏర్పడిన యునెస్కో క్లబ్స్ దశాబ్దాలుగా కృషి చేస్తున్నాయని ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర సమాచార కమిషనర్ బీవీ రమణ కుమార్ అన్నారు. అంతర్జాతీయ యునెస్కో దినోత్సవం యునెస్కో క్లబ్ ఆఫ్ గుంటూరు రజతోత్సవాల కార్యక్రమం స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం పద్మావతి కళ్యాణ వేదికపై ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక సామాజిక అసమానతలు పారదోలకుండ యునెస్కో క్లబ్బుల స్థాపన లక్ష్యాలు నెరవేరవన్నారు. భారతదేశం ప్రపంచ కుబేరుల స్థానం కోసం పోటీ పడుతున్నా ఆర్థిక దిక్సూచిలో 132వ స్థానం, ఆకలి సూచీలో 107వ స్థానంలో ఉండటం బాధాకరమన్నారు. రజతోత్సవాలకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శుభాకాంక్షల సందేశం వినిపించారు. గుంటూరు యునెస్కో క్లబ్ అధ్యక్షులు రామనాథం పరమేశ్వరరావు అధ్యక్షత వహించగా స్టీల్ ప్రాజెక్ట్ విశ్రాంత సీఎండీ పి.మధుసూదన్, కాన్ ఫెడరేషన్ ఆఫ్ యునెస్కో క్లబ్స్ ఉపాధ్యక్షులు ఎన్ఎన్ మిశ్రా, సెక్రెటరీ జనరల్ యోగేష్ కుల శ్రేష్ఠ, డాక్టర్ బొల్లినేని కీర్తి, దీప్తి శర్మ ప్రసంగించారు. ఈ సందర్భంగా 13 మందికి యునెస్కో లీడర్స్ మెమోరియల్ అవార్డ్స్, 16 మందికి విశిష్ట సేవా పురస్కారాలు అందజేశారు. అమ్మ డాన్స్ కూచిపూడి అకాడమీ కళాకారులు ప్రదర్శించిన మా తెలుగు తల్లికి మల్లెపూదండ నృత్య ప్రదర్శన ఆహుతులను విశేషంగా ఆకర్షించింది.

జంగాలకు ఏఐఎస్ఎఫ్ శుభాకాంక్షలు

విశాలాంధ్ర-గుంటూరు : విజయవాడలో జరిగిన సీపీఐ రాష్ట్ర సమితి సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా ఎన్నికైన కామ్రేడ్ జంగాల అజయ్‌కుమార్‌కు ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆదివారం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ, నగర అధ్యక్ష, కార్యదర్శులు జ్ఞానదీప్, శశి, జ్ఞానదీప్, సాయి, పవన్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి 'అమర్తలూరి బ్రహ్మేంద్రరావు'

విశాలాంధ్ర-గుంటూరు : దారు శిల్పిగా బహు గ్రంథ రచయితగా పరిశోధనాత్మక పుస్తకాలు రచించిన అమర్తలూరి బ్రహ్మేంద్రరావు (బ్రహ్మేజీ) బహుముఖ ప్రజ్ఞాశాలి అని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయ మూర్తి కేజీ శంకర్ అన్నారు. అమర్తలూరు బ్రహ్మేంద్రరావు రచించిన సృష్టి, స్థితి, లయ, తిరోభావము, అనుగ్రహములపై వ్రాసిన పంచామృతం పుస్తకాన్ని స్థానిక అరండల్‌పేట దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజ ప్రాంగణంలో ముఖ్యఅతిథిగా పాల్గొని కేజీ శంకర్ ఆవిష్కరించారు. హైకోర్టు విశ్రాంత రిజిస్టర్ ఇ.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ దారుశిల్పిగా శృంగేరి శంకరాచార్యుల ప్రశంసలు పొందిన బ్రహ్మేంద్రరావు ఖగోళ శాస్త్ర రహస్యాలను తెలిపే సూర్యునిపై పరిశోధ నాత్మక పుస్తకాన్ని వ్రాసి ప్రశంసలు పొందారని అభినందించారు. ప్రొఫెసర్ కందేపి సురేంద్రనాథ్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో తుర్లపాటి శంభయా చార్య, గిరిధర్, విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ప్రముఖులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం: మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు : సీపీఐ అశోక్ నగర్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి అన్నారు. ప్రారంభ సభ కార్యక్రమానికి శాఖ కార్యదర్శి ఆకిటి రామచంద్రుడు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన కోట మాల్యాద్రి మాట్లాడుతూ పార్టీ అనునిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్వహించడమే కాకుండా పేద ప్రజలకు ఖర్చుతో కూడుకున్న వైద్యంను ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి వారికి వైద్య సేవలను మరింత చేరువ చేస్తుందని చెప్పారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మరిన్ని సేవ అందించుటకు అశోక్ నగర్ శాఖ సమితి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు ఆకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు, చల్లా మరియదాసు, చిన్నపోతుల విజయ్ కుమార్, అశోక్ నగర్ శాఖ కమిటీ సభ్యులు బొడ్డుపల్లి విజయ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రస్ట్ నిర్వాహకులు అభినందనీయులు

విశాలాంధ్ర-తెనాలి : నందివెలుగులో పలు సేవాకార్యక్రమాలతో పేదలకు సేవలందిస్తున్న తన్నీరు ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు అభినందనీయులని స్థానిక సర్పంచ్ ధూళిపాళ్ల పవన్ కుమార్ అన్నారు. నందివెలుగు గ్రామంలో తన్నీరు ఛారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో తెనాలికి చెందిన భీష్మ ఐ కేర్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంను సర్పంచ్ ప్రారంభించగా డాక్టర్ అనిత కుమారి 200 మందికి పరీక్షలు నిర్వహించి 35 మందికి శుక్లాలు ఉన్నట్లు నిర్ధారించి మిగిలిన వారికి మందులు, కళ్లజోడులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్, అగస్తేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్ తన్నీరు వెంకటేశ్వరరావు, తన్నీరు శ్రీకాంత్, తన్నీరు రామకోటేశ్వరరావు, తన్నీరు శివన్నారాయణ, తన్నీరు అనిల్, హాస్పిటల్ సిబ్బంది బండ్లమూడి రాజేష్, జ్యోతి, ప్రతాప్, తేజ, నీలిమ, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక సమారాధన

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఆవరణలో కార్తీక మాసం సందర్భంగా ఆర్యవైశ్య వన సమారాధన నిర్వహించారు. వైభవంగా సుమారు 20 వేల మంది ఆర్యవైశ్యులు సకుటుంబంగా పాల్గొని ఒకచోట కలిసి అమ్మవారి ఆశీస్సులు పొంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ముఖ్యఅతిథులుగా తెనాలి శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్, గుంటూరు పశ్చిమ శాసనసభ్యులు మద్దాళి గిరి, మాజీ శాసనసభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, రాష్ట్ర, జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు విచ్చేశారు. ఆర్యవైశ్య నాయకులు సాదు ప్రతాప్ కుమార్, మునిసిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, దేసు శ్రీనివాసరావు, మద్దాళి శేషాచలం, ఉప్పల వరదరాజులు, గొడవర్తి సాయి హరే రామ్‌ల పర్యవేక్షణలో, తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు భాస్కరుని శ్రీనివాసరావు అనుబంధ సంస్థల అధ్యక్షులు కొల్లా గుర్నాథ్ గుప్తా, చుండూరి సాయి, కొండవీటి లక్ష్మీ పద్మావతి, చుండూరి వెంకట శివప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు.

కక్ష సాధింపుకే ఇళ్ల కూల్చివేత

విశాలాంధ్ర-మంగళగిరి : జనసేన పార్టీ ఆవిర్భావ సభకు భూములిచ్చారనే కక్షతోనే పోలీసులు పవన్ కళ్యాణ్‌ను ఇప్పటం వెళ్లకుండా అడ్డుకున్నారని జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇప్పటంలో కేవలం గోడలు తొలగించినట్లు వైసీపీ నేతలు చెబుతున్నారని కానీ వాస్తవానికి గ్రామాన్ని వల్ల కాడులా మార్చారని విమర్శించారు. వైసీపీ మంత్రులు ఇప్పటం వస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు. పవన్ ప్రకటించిన రూ.50 లక్షలతో నేరుగా ఆయనే వచ్చి అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి విజయ శేఖర్, మహిళా కోఆర్డినేటర్ పార్వతి, నాయకులు కాపరౌతు సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

చీటీల సొమ్ముతో మహిళ ఉడాయింపు

విశాలాంధ్ర-తాడికొండ : నమ్మకంగా చీటీలు కట్టించుకొని వచ్చిన డబ్బులతో మహిళ ఉడాయించిన ఘటన తాడికొండలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన షేక్ ఫాతిమా తన ఇంటివద్ద ఉన్న మహిళలతో చీటీలు వేసుకుందాం కొంచెం కొంచెం డబ్బులు దాచుకుంటే పిల్లల చదువులకు ఉపయోగకరంగా ఉంటాయని గ్రూప్ సభ్యులకు నమ్మకంగా చెప్పడంతో, గ్రూప్ సభ్యులు రూ.2 లక్షలు చీటికి నెలకు రూ.5 వేలు 2021 నుంచి కట్టుకుంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో బాధితులు డబ్బులు అడుగగా భద్రంగానే ఉన్నాయి ఇస్తానులే అని సమాధానం చెపుతూ వచ్చింది. అయితే వసూలు చేసిన డబ్బులతో నెల నుంచి ఫాతిమా కనపడకుండా పోవడంతో బాధితులు వారింటికి వెళ్లి అడగ్గా భర్త, మామ బాధితులను చంపుతామని బెదిరించారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

పవన్ కల్యాణ్‌కు వైసీపీ నేతల సవాల్

విశాలాంధ్ర-మంగళగిరి : పవన్ కళ్యాణ్‌కు దమ్ముంటే ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిపై పోటీ చేసి గెలవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సవాల్ విసిరారు. 175 నియోజకవర్గాల్లోనూ ఏ పార్టీతోనూ పొత్తు లేకుండా సింగిల్‌గా బరిలోకి దిగాలన్నారు. నగరంలోని ఐబీఎస్ ప్రెస్‌క్లబ్ భవన్‌లో వారు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ కాపు సామాజిక వర్గాన్ని ఉద్ధరిస్తానని చెప్పుకుంటున్న పవన్ కళ్యాణ్ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ముద్రగడ పద్మనాభం ఆయన సతీమణిలపై దాడులు జరిగితే ఏం చేశారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఆర్కే నివాసం ఉంటున్న ప్రాంతం పొన్నూరు నియోజకవర్గంలో ఉందని మంగళగిరి నియోజకవర్గంలో లేదని ఆ మాత్రం పరిజ్ఞానం కూడా పవన్ కళ్యాణ్‌కు లేదని విమర్శించారు. ఇప్పటం గ్రామ అభివృద్ధికి పవన్ కళ్యాణ్ ప్రకటించిన రూ.50 లక్షల విరాళం ఎందుకు ఇవ్వలేదని ఇదేనా గ్రామ ప్రజలపై ప్రేమ అని ప్రశ్నించారు. ఈ విలేకరుల సమావేశంలో వైసీపీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, వైసీపీ తాడేపల్లి మండల విభజన విభాగ అధ్యక్షులు మున్నంగి వివేకానంద రెడ్డి, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ మేకా వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11న సీఆర్‌డీఏ కార్యాలయంలో ఫిర్యాదులు

విశాలాంధ్ర-గుంటూరు : అమరావతి రాజధాని మాస్టర్‌ప్లాన్ మార్చకుండా ఉండేందుకు ఈ నెల 11వ తేదిన సీఆర్‌డీఏ కార్యాలయంలో ఫిర్యాదులు అందజేస్తామని అమరావతి జేఏసీ లీగల్ కో-ఆర్డినే టర్ డాక్టర్ మాదాల శ్రీనివాస్ అన్నారు. గుంటూరులోని ఓ హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఆర్‌డీఏ చట్టసవరణ, పేదల ఇళ్ల స్థలాల పేరుతో వివాదాలు సృష్టిస్తున్నారన్నారు. సీఆర్‌డీఏ చట్టం సవరించి పేదలకు ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని, చివరి రక్తపు బొట్టు వరకు పోరాడుతూ ప్రభుత్వ కుటిల యత్నాలను అడ్డుకుంటామన్నారు. అమరావతి పరిరక్షణ సమితి కన్వీనర్ ఆరే శివారెడ్డి మాట్లాడుతూ బుధవారం హైకోర్టులో వచ్చిన తీర్పు తర్వాత పాదయాత్ర కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. తాత్కాలికంగా నిలిపి వేసిన పాదయాత్ర వాహనా లను ప్రైవేటు స్థలంలో నిలిపి ఉంచామని, అయితే వాహనాలు నిలిపి ఉంచిన స్థలం యజమానిని బెది రించారన్నారు. దివ్యరథం నుంచి సీసీ కెమెరా విజు వల్స్ కూడా పోలీసులు తీసుకెళ్లారని చెప్పారు. పాద యాత్ర ద్వారా అరసవల్లి వెళ్లి తీరుతామని స్పష్టం చేశారు. జేఏసీ మెంబెర్స్ దనేకుల రామారావు, పువ్వాడ సుధాకర్, కళ్ళం రాజశేఖర్ రెడ్డి, ఆకుల ఉమామహేశ్వరరావు, జమ్ముల శ్యామ్ కిషోర్, కొమ్మి నేని సత్యనారాయణ, కొండపాటి సతీష్ చంద్ర, అమరావతి పరిరక్షణ సమితి కోకన్వీనర్ గద్దె తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగునాట గొప్ప తత్వవేత్త పోతులూరి వీరబ్రహ్మం: ఎమ్మెల్సీ

విశాలాంధ్ర-గుంటూరు : తెలుగు నాట గొప్ప తత్వవేత్త పోతులూరి వీరబ్రహ్మం అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. ఈ నెల 12న సాయంత్రం నగరంలో ఉన్న జాషువా విజ్ఞాన కేంద్రంలో జరగనున్న 'సామాజిక తత్వవేత్త పోతులూరి వీరబ్రహ్మం-తాత్వికత'పై సెమినార్ ఆహ్వాన పత్రికను ఆయన ఆదివారం నగరంలోని మద్రాస్ కాఫీ హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కవి బి.విల్సన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ తెలుగు నాట కులాధిపత్యంపై పోరాడిన తత్వవేత్తలలో పోతులూరి వీరబ్రహ్మం గొప్పవాడని అన్నారు. ఈ సెమినార్‌కు పోతులూరి వీరబ్రహ్మం 8వ తరం ముని మనవడు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. పాండురంగాచార్యులు రాసిన 'పోతులూరి వీరబ్రహ్మం-తాత్వికత' పుస్తకాన్ని సెమినార్‌లో ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. విద్యార్థి, యువజన మేధావులు కూడా పాల్గొంటారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో లిటరేచర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు కడియం జేమ్స్, ప్రధాన కార్యదర్శి బి.శ్యాంబాబు, కవి ఎస్ఎం సుభాని, నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు, గాయకులు జెట్టి బాబురావు, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

సేవా రంగం చాలా గొప్పది..

విశాలాంధ్ర-గుంటూరు : రాజకీయ రంగం కన్నా, సేవా రంగం చాలా గొప్పదని వైఎస్సార్‌సీపీ అధ్యాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. గుంటూరు నగరంలోని ప్రభుత్వ పెన్షన్‌దార్ల కళ్యాణ మండపంలో సంఘ సేవకురాలు సానికొమ్ము జ్యోతి రెడ్డి నిర్వహిస్తున్న ఆనందమయి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ద్వితీయ వార్షికోత్సవ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో ఆకలి బాధలు పడేవారు లేరని సాయపడటం అంటే కేవలం అన్నం పెట్టడం మాత్రమే కాదని సామాజిక సమతుల్యం కోసం సీఎం జగన్ అనేక పథకాలను అమలు చేస్తున్నారని మాదిరెడ్డి అన్నారు. సభాధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ అండ్ హ్యాపీ రిసార్ట్స్ ప్రెసిడెంట్ అంబటి మధుమోహన కృష్ణ మాట్లాడుతూ కరోనా సమయంలో నిర్భాగ్యుల ఆకలి తీర్చిన వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకురాలు సానికొమ్ము జ్యోతి రెడ్డి సేవలు మరువలేనివన్నారు. అఖిల్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ కందుల చందూ మాట్లాడుతూ ఒక మహిళ సేవా రంగంలో దూసుకువెళ్లడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము వేంకటేశ్వర రెడ్డి, హ్యూమన్ రైట్స్ విజిలెన్స్ సభ్యులు తనకంటి వేణు, సమాజ్ వాదీ పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షులు జగదీష్ యాదవ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం జ్యోతి రెడ్డిని ఘనంగా సత్కరించారు.

బీసీల పార్టీ బీజేపీ



విశాలాంధ్ర-గుంటూరు : బీసీల పార్టీ బీజేపీ అని, బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం 27 శాతం రిజర్వేషన్ల కోసం చట్టబద్ధత కల్పించింది మోదీ అని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ, రాష్ట్ర కార్యదర్శి మాగంటి సుధాకర్ యాదవ్ అన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం గుంటూరు బీజేపీ జిల్లా కార్యాలయంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు అనుమోలు ఏడుకొండలు గౌడ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన బిట్రా శివన్నారాయణ, మాగంటి సుధాకర్ యాదవ్‌లు మాట్లాడుతూ టీడీపీ, వైసీపీలు రెండూ కుటుంబ పార్టీలేనని, బీసీలను వారు ఎదగనీయరన్నారు. కుల సంఘాలతో లోపాయికారీ ఒప్పందాలతో బీసీలను అణగదొక్కుతున్నారని, సమాజం హర్షించదని, వారికి బుద్ధి చెప్పే రోజు ఎంతో దూరంలో లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలపాటి రవికుమార్, అన్నం శ్రీనివాస్, శివకృష్ణ రామగ్రైని, వాసా పల్లపు రాజు, రాకేష్ జీ, నాగమల్లేశ్వరి, హరికృష్ణ, మోతే వెంకట శేషగిరిరావు, తుల్లిమిలి రామకృష్ణ, కామేపల్లి వెంకటేశ్వర్లు, మల్లాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అధీనంలోనే ఇప్పటం

విశాలాంధ్ర-తాడేపల్లి : పోలీసు బలగాల అధీనంలోనే ఇప్పటం గ్రామం ఉందని జనసేన పార్టీ తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఇప్పటం గ్రామంలో రైతులతో కలిసి మాట్లాడుతూ గ్రామంలో వైఎస్సార్ విగ్రహాలకు కంచెల ద్వారా పోలీసులు రక్షణ కల్పించారని జగన్ ప్రభుత్వం చర్యలపై ఇప్పటం గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఇప్పటంలో జరిగిన ఘనటపై వైసీపీ తప్ప మిగిలిన అన్ని పార్టీలు కూడా బాధితులను పరామర్శించారు. గ్రామస్థులు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. వైసీపీ దుష్టచతుష్టయం ఎమ్మెల్యేపై ఒత్తిడి తెచ్చారు. అన్యాయంగా మా ఇళ్లను కూల్చేశారు. పవన్ కళ్యాణ్ 24 గంటల్లో స్పందించి గ్రామానికి వచ్చారు. ఇంతమంది రోదన... జగన్‌కు తప్పకుండా తగులుతుందని ఇప్పటం గ్రామ రైతులు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ తాడేపల్లి మండల ప్రధాన కార్యదర్శి తిరుమలశెట్టి శ్రీధర్, ఇప్పటం గ్రామ అధ్యక్షుడు తిరుమలశెట్టి నరసింహారావు, తాడేపల్లి మండల సోషల్ మీడియా సభ్యుడు శంకర్ శెట్టి బాబి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడకుండా అవకాశాలు రావు..

విశాలాంధ్ర-తాడికొండ : రాజకీయాలలో కష్టపడకుండా అవకాశాలు రావని మాజీ మంత్రి, వైసీపీ నెల్లూరు ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్ యాదవ్ తెలిపారు. తాడికొండ అడ్డ రోడ్డు సెంటర్‌లో ఆదివారం యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన జరిగింది. ముఖ్యఅతిథిగా అనిల్ కుమార్ యాదవ్ హాజరయ్యారు. కార్యక్రమానికి గోళ్ళ శివశంకర్ యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ ప్రసంగించారు. పునాదులు గట్టిగా ఉంటే జాతి అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. యాదవ జాతి అంటే తనకు ఎనలేని అభిమానమన్నారు. నెల్లూరులో అన్ని వర్గాల ప్రజలు ఓట్లు వేస్తేనే తాను గెలుపొందానని అన్నారు. ప్రస్తుతం డబ్బు రాజకీయాలు నడుస్తున్నాయని, డబ్బు లేకుంటే రాజకీయాలు చేయలేమని తెలియజేశారు. బిడ్డలను జాగ్రత్తగా చదివించాలని, వ్యాపార రంగంలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి యాదవ్, రమేష్ యాదవ్, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ శ్యాం ప్రసాద్ యాదవ్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ ఎం.హరీష్ యాదవ్, సంఘ నాయకులు ఆలా వెంకటేశ్వర్లు, ఎన్.బాలాజీ, ఎంఎన్ కొండయ్య, వై.నాగార్జున, నిమ్మకాయల రాజనారాయణ, సత్యనారాయణ, నాగరాజు పాల్గొన్నారు.

అధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : తాడేపల్లి పట్టణ పరిధిలోని స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం పట్టణ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు కంభం సాయిచంద్ ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణ టీఎన్ఎస్ఎఫ్ ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్, టీడీపీ తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శ దారా దాసు, నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు రాయపూడి కిరణ్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు నిలబడాలన్న కూల్చాలన్న స్టూడెంట్స్ కీలకమన్నారు. ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. స్టూడెంట్స్ సమస్యలపై ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి సమస్య పరిష్కారమయ్యే విధంగా కృషి చేయాలని అన్నారు. హరికృష్ణ, మాగంటి కళ్యాణ్, రేఖ వినయ్ కృష్ణ, నల్లగొర్ల శశి పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు **శ్రీమతి పమిడిఘంతం మహాలక్ష్మమ్మ, భర్త వెంకట రమణయ్య గారు ది.05-11-2022 వతేదీన** ఎ.టి.అగ్రహారంలోని తన ఇంటినుండి తన కుమారుడైన **పి. వెంకట సత్యనారాయణ గారి** టూ వీలర్ మోటారు సైకిల్‌పై షెడ్యూలు ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ పార్టీషన్ దస్తావేజు నెం: **497/1947 ది: 19-02-1947** ను చేతిసంచిలో పెట్టుకొని కలెక్టరు ఆఫీసు వైపు వస్తుండగా మార్గమధ్యమున పై తెలిపిన ఒరిజినల్ దస్తావేజు గల చేతిసంచి జారి పడిపోయినది. నా క్లయింటు ఎంత వెతికిన సదరు దస్తావేజు దొరకలేదు. సదరు దస్తావేజు ఎవరికైన దొరికిన యెడల తెచ్చి ఇచ్చిన వారికి తగిన పారితోషికము ఇవ్వబడును. సదరు దస్తావేజును ఎవరైనా దుర్బుద్ధితో స్వప్రయోజనాలకు ఉపయోగించిన వారిపై నాక్లయింటు తీసుకొను చట్టపరమైన సివిల్ క్రిమినల్ చర్యలకు బద్ధులగుదురు.

షెడ్యూలు: గుంటూరు సిటీ, A.T.అగ్రహారం 6వలైనులో, నల్లపాడు గ్రామ డి.నెం: 107/ఎ మరియు 107/బి, డోర్ నెం: 26-32-20రు గల చ.గ.270లు స్థలము అందలి రెండు అంతస్తుల డాబా.

చాగంటి రఘురామి రెడ్డి,
అడ్వకేట్, 7/4 అరండల్ పేట, గుంటూరు,
సెల్: 9154091969

IN THE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE : : GUNTUR

E.P.No.134/2022 IN O.S.No.1210/2020

Between:

Nuthikattu Siva Prasad - Plaintiff

AND

Jadda Jyothi Raju - Defendant

పై నంబరు గల దావాలో వాది అయిన నా క్లయింటు వద్ద ప్రతివాది వాది డబ్బును అప్పుగా తీసుకొని నా క్లయింటు అయిన వాది పేరుతో ప్రోనోటు వ్రాసినందున సదరు ప్రతివాదినుండి బాకీ వసూలు నిమిత్తము వాది ప్రతివాదిపై ప్రోనోటు కేసువేసిన దరిమిలా ప్రతివాది అయిన **జద్దా జ్యోతి రాజు** గారు పలుమార్లు శ్రీ కోర్టు వారినుండి నోటీసులు వగైరాలు పంపినను కావాలనే వుద్దేశ్యపూరకముగా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున **ది.01-12-2022 న ఉదయం గం. 10.30 నిలకు** స్థానిక శ్రీ 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, గుంటూరు వారి సమక్షములో జరుగు వాయిదాకు మీరు ప్రత్యక్షముగా కానీ మీచే నియమించబడు వకీలుగారి ద్వారా కానీ శ్రీ కోర్టువారి ఎదుట హాజరై మీయొక్క అభ్యంతరములు తెలియచేయుటకు మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా ప్రత్యామ్నాయ సర్వీసునిమిత్తము శ్రీ కోర్టువారు ఆర్డరు వేసియున్నారు కావున సదరు వాయిదా తేదీన ప్రతివాది అయిన మీరు పై తెల్పిన విధముగా హాజరు కానీ యెడల సదరు మీపై వేసిన పై నంబరు గల కేసు మీయొక్క పరోక్షములో శ్రీ కోర్టువారిచే తీర్మానము జరుగునని ఈ పేపరు ప్రకటన ద్వారా ప్రత్యామ్నాయ సర్వీసు నిమిత్తము ఇందు మూలముగా తెలియచేయడమైనది.

వాయిదా తేది : 01-12-2022

చుండూరు సత్యసాయి బాబు
న్యాయవాది, గుంటూరు
సెల్ : 9392356995

ముస్లింల ఇజ్‌తమాకు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-చిలకలూరిపేట రూరల్ : అన్ని వర్గాల అభ్యున్నతికి జ్ఞానేశ్వర ఫౌండేషన్ సహకారం అందిస్తుందని సంస్థ చైర్మన్ షేక్ జాన్ సైదా అన్నారు. ఆదివారం చిలకలూరిపేట పట్టణములోని కళామందిర్ సెంటర్లో ఉన్న మసీదు ఆవరణలో జరిగిన సమావేశంలో జాన్ సైదా మాట్లాడారు. గుంటూరు పట్టణంలో జరిగే ఇజితమా జాని మాజ్ కార్యక్రమానికి రూ.50 వేలను ముస్లిం మత పెద్దలకు జాన్ సైదా అందజేశారు. సలీం కుమార్తె వివాహానికి రూ.20 వేలు ఆర్థిక సహాయం చేశారు. అనంతరం జాన్ సైదాను ముస్లిం పెద్దలు దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, నాదెండ్ల మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు గొంటు శ్రీనివాసరెడ్డి, ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మాలధారణ స్వాములకు అన్నదానం

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టిన స్వాములకు ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పెదకూరపాడు శివాలయంలో మాల ధరించిన అయ్యప్పలకు, శివభక్తులకు, భవానీలకు ఇతర దీక్షలు స్వీకరించిన స్వాములకు కార్తీక మాసం సందర్భంగా ఈ అన్నదాన కార్యక్రమం జరుగుతుంది. వందలాది భక్తులు పాల్గొని బిక్ష చేస్తూ అన్నదాత సుఖీభవ అంటూ దీవిస్తున్నారు.

కోటేశ్వరరావు భౌతికకాయానికి నివాళి

విశాలాంధ్ర-అమరావతి : మునుగోడు గ్రామానికి చెందిన బయ్యవరపు కోటేశ్వరరావు అనారోగ్యంతో మరణించారు. ఈ సందర్భంగా ఆదివారం వారి భౌతికకాయాన్ని సందర్శించిన పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు పాల్గొన్నారు.

కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

విశాలాంధ్ర-అమరావతి : మండలంలోని జూపూడి గ్రామానికి చెందిన జెట్టి ప్రసాదరావు అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదివారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలతో మమేకమవుతూ నిరంతరం శ్రమించే వ్యక్తిని కోల్పోవడం విచారకరమని అన్నారు. కుటుంబసభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు.

నదీ ప్రవాహంలో బాలుడు గల్లంతు

విశాలాంధ్ర-కొల్లూరు : కృష్ణా నదీ నీటి ప్రవాహంలో ఓ బాలుడు గల్లంతైన సంఘటన ఆదివారం సాయంత్రం కొల్లూరు మండలపరిధిలోని చిలుమూరులో చోటుచేసుకంది. పోలీసుల కథనం మేరకు.. తెనాలి మారీస్‌పేటకు చెందిన ఇంటర్ చదువుతున్న షేక్ దస్తగిరి కుమారుడు జానీ(15) తన కుటంబ సభ్యులు, తమ పరిసర గృహాల వారితో కలసి విహారయాత్రకు చిలుమూరు వచ్చాడు. తనతో పాటు వచ్చిన తన స్నేహితుడు షేక్ అసిన్‌తో కలసి తమ బృందంతో పాటు నదిలో స్నానాలకు దిగారు. నదిలో నీరు తక్కువుగా ఉండటంతో నడుచుకుంటూ మధ్యలో ఉన్న ఇసుక దిబ్బలపైన ఆడుకునేందుకు వెళ్లిన ఇరువురు బాలురు ఒడ్డుకు తిరిగి వస్తున్న సమయంలో నదిలో నీటి మట్టం పెరగడాన్ని గమనించకుండా నీటిలోకి దిగడంతో ప్రవాహ వేగానికి ఇరువురూ కొట్టుకుపోతుండగా, నది వద్ద ఉన్న స్థానిక యువకుడు నవీన్ వీరిని గమనించి వారిని రక్షించేందుకు ప్రయత్నించాడు. అసిన్ అనే బాలుడ్ని కాపాడి ఒడ్డుకు చేర్చిన యువకుడు మరో బాలుడు జానిని కాపాడేందుకు ప్రయత్నించినా ప్రవాహంలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. కొల్లూరు పోలీసులు యువకుడి కోసం గజ ఈతగాళ్లతో నదిలో గాలింపు చర్యలు చేపట్టారు.

పాదయాత్ర వల్లనే సంచలన పాలన: మంత్రి రజిని

విశాలాంధ్ర-చిలకలూరిపేట రూరల్ : రాష్ట్రంలో కొనసాగుతున్న సంచలన పరిపాలనకు జగనన్న సుదీర్ఘంగా కొనసాగించిన పాదయాత్రే కారణమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రను ప్రారంభించి ఐదేళ్లు పూర్తైన సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం కేక్ కట్ చేశారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడారు. 341 రోజుల పాటు సుదీర్ఘంగా సాగిన పాదయాత్ర ఒక రికార్డని చెప్పారు. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు 3648 కిలోమీటర్ల పొడువునా సాగిన ఈ యాత్ర ద్వారా జగనన్న దాదాపు 2 కోట్ల మంది ప్రజలను ప్రత్యక్షంగా కలిశారని పేర్కొన్నారు. ఈ యాత్ర చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతుందని తెలిపారు.

టీడీపీ దుర్మార్గాలపై ప్రజల ఆయుధం పాదయాత్ర..

టీడీపీ దుర్మార్గపు పరిపాలన ఫలితంగా ప్రజలు ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్న సమయంలో జగనన్న పాదయాత్ర ద్వారా ప్రజల్లోకి వచ్చారని గుర్తుచేశారు. ఈ యాత్రను టీడీపీ అరాచకపు పాలనను అంతమొందించే ఆయుధంగా ప్రజలు భావించారని తెలిపారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులు, కన్నీళ్లు, కష్టాలను ఈ పాదయాత్ర ద్వారా జగనన్న ప్రత్యక్షంగా చూశారని, వారి సమస్యల పరిష్కారం కోసం పాదయాత్రలో నుంచి పుట్టుకొచ్చిన పథకాలే అమలవుతున్నాయని వివరించారు. జగనన్న పాదయాత్రలో ఇచ్చిన హామీలనే మేనిఫెస్టో రూపంలోనూ తెచ్చారని, మూడున్నరేళ్ల కాలంలోనే 98 శాతం అమలు చేశామని వివరించారు.

బాబుది ఒట్టి మాటల ప్రభుత్వం..

చంద్రబాబునాయుడు తాను ముఖ్యమంత్రిగా ఉన్నన్ని రోజులు కేవలం మాటలు చెబుతూ కాలం వెళ్లదీశారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన మూడేన్నరేళ్లలోనే ప్రభుత్వం అంటే ఎలా పనిచేయాలో చూపించిన గొప్ప నాయకుడు జగనన్న అన్నారు. పరిపాలన, సంక్షేమం, ప్రజలకు మేలు చేసే విషయాల్లో జగనన్న దరిదాపుల్లోకి కూడా వచ్చే నాయకులే లేరని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-దుర్గి : ప్రతిఒక్కరూ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని మాచర్ల క్రిమినల్ సివిల్ సీనియర్ జడ్జి మధు అన్నారు. మండల పరిధిలోని రాజానగర్ పంచాయతీ శివారు గజాపురంలో ఆదివారం రాత్రి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చిన్న చిన్న తగాదాలు, భూ సమస్యలు, ఆర్థిక సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించుకోవాలే గాని కోర్టులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు. న్యాయవాది గంగుల శ్రీనివాసరావు, జూని యర్ న్యాయవాది శివనాయక్, మండల లీగల్ న్యాయ సదస్సు కమిటీ, పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా కొమ్మాలపాటి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-పెదకూరపాడు : మాజీ శాసన సభ్యులు ఇంచార్జ్ డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ జన్మదిన వేడుకలు ఆదివారం పెదకూరపాడులో యూనియన్ బ్యాంకుపైన తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల టీడీపీ అధ్యక్షులు అర్తిమళ్ల రమేష్ రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం నిత్యం పాటుపడే మంచి మనిషి కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు ఈ కార్యక్రమంలో బెల్లంకొండ రామగోపాలరావు, వడ్లమూడి అప్పారావు, షేక్ ముంతాజ్, మద్దిరాల గంగాధర్, కొండవీటి ప్రసాద్, గుడిపూడి బాబురావు, ఏటుకూరి బ్రహ్మయ్య, షేక్ మస్తాన్ షరీఫ్, షేక్ అజిముల్లా, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అందరికి పథకాలు అందిస్తున్న ఘనత జగన్‌దే

విశాలాంధ్ర-అమరావతి : పేదలకు అన్ని విధాలుగా సాయం చేస్తున్న పాలన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఉంగుటూరులో ఎమ్మెల్యే పర్యటించారు. ఆలయంలో పూజలు చేసిన అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులం, మతం, ప్రాంతం, పార్టీలు చూడకుండా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌దేనన్నారు. గతంలో పాలన మాత్రమే ఇంటి ముందుకు వచ్చేదని, ఇప్పుడు పాలకులు కూడా నిత్యం పేదల ఇళ్లకు వస్తున్నారని చెప్పారు. వారి సమస్యలు తెలుసుకొని.. వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఉంగుటూరులో మూడున్నరేళ్లలో సుమారు రూ.10.70 కోట్లతో సంక్షేమాభివృద్ధి చేశామని తెలిపారు.

హయ్యర్ బస్సులు ప్రారంభం

విశాలాంధ్ర-మాచర్ల : ప్రతి పల్లెకు ఆర్టీసీ బస్సు సర్వీసులను నడిపించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మాచర్ల డిపో పరిధిలో ఏర్పాటుచేసిన రెండు హయర్ బస్సులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సు సర్వీసులతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా మరికొన్ని బస్సులను టెండర్ల ద్వారా కాంట్రాక్టు పద్ధతిన ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలోనే ఇప్పటికి మాచర్ల డిపో పరిధిలో సుమారు 10 బస్ సర్వీస్‌లను కాంట్రాక్టు పద్ధతిన తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. డిపో మేనేజర్ ఆర్.పిచ్చయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే పిఆర్కే ప్రారంభించిన 2 హయ్యర్ బస్సులను మాచర్ల-గుంటూరు రూట్లో నడపనున్నట్టు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు మురారి, సూపర్‌వైజర్ బీఎల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

98 శాతం హామీల అమలు ఘనత మాదే..

విశాలాంధ్ర-వినుకొండ : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చారిత్రాత్మకంగా మారిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్రకు బీజం పడి నేటికి ఐదు వసంతాలు పూర్తి అయిన సందర్భంగా వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో వారి తనయుడు యువ నాయకులు బొల్లా గిరి బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని పార్టీ కార్యాలయంలో, పట్టణంలో దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేనిఫెస్టోలో జగన్ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల్లో 98.44 శాతం అమలు చేశారని అన్నారు. రాజకీయాల్లో నిబద్ధత, నిజాయితీ కలిగిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని, దేశంలో మరే ముఖ్యమంత్రి కూడా ఈ విధంగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని అన్నారు.

అరుణాచలేశ్వరుని దర్శనానికి రెండు బస్సులు

విశాలాంధ్ర-వినుకొండ : మహా పౌర్ణమి సందర్భంగా కార్తీక మాసంలో అరుణాచలేశ్వరుని దర్శించుటకు ప్రజా రవాణా శాఖ నియోజకవర్గం ప్రజలకు రెండు బస్సులను ఏర్పాటు చేసినందుకు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ బాణావత్ కోటేశ్వర నాయక్ మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా పరిసర ప్రాంత ప్రజల సౌకర్యార్థం అరుణాచలం వెళ్లుటకు ఏర్పాటుచేసిన బస్సులను ఆదరించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. పంచారామాలను దర్శించుటకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు. అయ్యప్ప స్వాముల సౌకర్యార్థం శబరిమలై యాత్ర కోసం ప్రత్యేక బస్సులు అందుబాటు ధరలలో ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిపో సిబ్బందికి, సహకరించిన భక్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

బిల్లులుంటేనే చెక్క పని

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ పట్టణ చిత్రిక మిషన్స్ అండ్ చెక్కుడు మిషన్ వారు వినుకొండ గుంటి ఆంజనేయ స్వామి గుడి వద్ద గల బ్రహ్మంగారి గుడి ఆవరణలో జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అంగలకుదురు ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సమస్యలపై చర్చించి కమిటీ సభ్యులు మాట్లాడుతూ సోమవారం నుంచి చిత్రిక మిషన్స్ అండ్ చెక్కుడు మిషన్ వారు బిల్లులు ఉంటేనే చెక్క చిత్రిక పనిచేస్తామని కమిటీ తీర్మానించి నిర్ణయం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కంచర్ల సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడి పావులూరి గిరి, ఎస్‌కే రసూల్, కార్యదర్శిగా కొండూరి చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి పూసపాడు ఎలమంద చారి, ఉయ్యూరు నాగరాజు, కోశాధికారి సిద్ధి వెంకటరావు, రావుట్ల తిరుమల చారి, కందుకూరి. బ్రహ్మం, పరబ్రహ్మం, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర్ల సంక్షేమానికి వైసీపీ కృషి

విశాలాంధ్ర-మాచర్ల : వడియ రాజుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం కార్తీక వన సమారాధన, వడ్డెర కళ్యాణ మండపం నిర్మాణానికి జరిగిన భూమి పూజా కార్యక్రమంలో ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం కేటాయించని విధంగా జగన్ కోట్లాది రూపాయల నిధులను ఒడియరాజుల ఆర్థికాభివృద్ధికి ఖర్చు చేశారన్నారు. వడ్డెర్లను సామాజిక, ఆర్థికంగా, రాజకీయంగా చైతన్యవంతులుగా చర్చిదిద్దేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వందలాదిమంది యువతకు నామినేటెడ్ పదవులను కేటాయించి ఆ సంఘాన్ని ఆదుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గుంటూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులు తన్నీరు ఆంజనేయులు, ఏపీ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవల్ల రేవతి, జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ బత్తుల అనురాధ, మాచర్ల మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్ పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

విశాలాంధ్ర-దుర్గి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ప్రభుత్వ విప్, పార్టీ జిల్లా అధ్యక్షులు, జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, మాచర్ల శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ముటుకూరు గ్రామంలో ఆదివారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో నాయకులతో కలిసి వీధుల్లో పర్యటించారు. సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ఎమ్మెల్యే వారికి వివరించారు. వలంటీర్స్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ముందుగా సర్పంచ్ తోటకూర వెంకట నరసమ్మ నాగేశ్వరావు, ఎంపీటీసీ పసుపులేటి వెంకట్రామయ్య, ఉప సర్పంచ్ గొంది నాసరయ్యల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఉన్నం పెద్దబాయి, కేశంశెట్టి అంజయ్య, జాస్తి రామూర్తి, కొల్లి హనుమయ్య, కట్టెబోయిన రవి, పేర్ల వెంకటేశ్వర్లు, లింగా గురవయ్య, పులిమెల ప్రసాద్, ఎంపీడీవో జీఎల్ గుప్తా, ఏవో అమీర్ రెడ్డి, ఏపీఓ వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ రహదారిపై ప్రయాణమెలా..?

విశాలాంధ్ర-శావల్యాపురం : నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి అత్యంత ప్రమాదకరంగా మారింది. మండల కేంద్రమైన శావల్యాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దగ్గర జాతీయ రహదారిపై గుంతలు ఏర్పడి ప్రయాణికులకు తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రోడ్డు ఇంత అధ్వానంగా, ప్రమాదకరంగా మారినా ప్రభుత్వం స్పందించడం లేదని, గుంతల కారణంగా వాహనాలు పాడవుతున్నాయని, ప్రయాణం కష్టతరంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

నాగార్జున కొండ పర్యాటకుల సందడి

విశాలాంధ్ర-విజయపురిసౌత్ : ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండను ఆదివారం భారీగా పర్యాటకులు సందర్శించారు. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు నాగసిరి లాంచీ, శాంతిసిరి లాంచీలలో కొండకు వెళ్లిన పర్యాటకులు అక్కడ మ్యూజియంలో ఉన్న బుద్ధిని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్తూపం, అశ్వమేధశాల, స్నానాల గట్టు, బోధి వృక్షం చూసి తన్మయం చెందారు. అనంతరం పచ్చని కొండల మధ్య ఉన్న అనుపు, యాంపి స్టేడియం, అశ్వమేద యగ్నశాల, శ్రీ రంగనాథస్వామి దేవాలయం, తదనంతరం 60 అడుగుల ఎత్తునుంచి జాలువారే ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు. ఆదివారం రూ.60 వేల ఆదాయం సమకూరింది.

రైల్వే గేటు మూసివేత

విశాలాంధ్ర-శావల్యాపురం : గుంటూరు-గుంతకల్ రైల్వే మార్గంలోని శావల్యాపురం గ్రామం వద్ద గల 268 నెంబరు రైలు గేటు ఆదివారం ఉదయం మూసి వేసి మరమ్మతులను నిర్వహిస్తున్నారు. మండల కేంద్రమైన శావల్యాపురం నుంచి కారుమంచి వెళ్లే మార్గంలో మరమ్మతుల కారణంగా రైల్వేగేటును ముందస్తు సమాచారం లేకుండా హఠాత్తుగా మూసివేయడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. వాహనాలు వెళ్ళేందుకు ప్రత్యామ్నాయం లేకపోవడంతో ప్రయాణీకులు అక్కడి నుంచి నిరాశగా వెనుదిరిగారు. ఈ నెల 8వ తేదీ వరకు మరమ్మత్తులు కొనసాగుతాయని, అప్పటివరకు రైల్వేగేటు మూసే ఉంటుందని, కనుక వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకొని ప్రయాణించాలని రైల్వే అధికారులు తెలిపారు.

విద్యుత్ బకాయిలు చెల్లించాలని వత్తిడి

విశాలాంధ్ర-శావల్యాపురం : పాత విద్యుత్ బకాయిలు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో కనెక్షన్ తొలగిస్తామని ఎస్సీ కాలనీ వాసులపై విద్యుత్ అకారులు వత్తిడి చేయడం దుర్మార్గమని పల్నాడు జిల్లా తెలుగుయువత ప్రధాన కార్యదర్శి చింతా గంగయ్య అన్నారు. శావల్యాపురంలో ఆయన మాట్లాడుతూ ఏళ్ళనాటి విద్యుత్ బకాయిలు ఇప్పుడు చెల్లించాలంటూ, లేనిపక్షంలో విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తామంటూ విద్యుత్ అధికారులు ఎస్సీ కాలనీవాసులను బెదిరిస్తున్నారని, ప్రభుత్వ కార్యాలయాల్లో లక్షల బకాయిలు ఉంటే వసూలు చేతకాని అధికారులు ఎస్సీ కాలనీలలో వత్తిడి చేయడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - బాపట్ల : ప్రభుత్వం అందించే పథకాలు సద్వినియోగం చేసుకుంటూ ప్రజలు తమ జీవితాలు బాగు చేసుకోవాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ బి.సాధుబాబు సూచించారు. బాపట్ల పురపాలక సంస్థ నందు ఆదివారం ప్రజలకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.రుక్మిణి అధ్యక్షత వహించగా సాధుబాబు మాట్లాడుతూ ఇంకా ఎవరైన అర్హత కలిగి ఉండి పథకాలు అందకపోతే నమోదు చేసుకోవాలని కోరారు. మున్సిపల్ డీఈ కె.శ్రీనివాసులు ఇప్పటి వరకు లబ్ధిదారులకు అందించిన పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ప్రభుత్వ న్యాయవ్యాది కె.రవిబాబు, న్యాయవాదులు ఊట్ల రామారావు, బి.లీలాకృష్ణ, బండి రామ్మూర్తి, నటరాజ్, శ్యామలాదేవీ, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

300 మందికి ఉచిత కంటి పరీక్షలు



విశాలాంధ్ర - కర్లపాలెం : మండలంలోని నర్రావారి పాలెం పెనూయేలు మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో కంటి వైద్యులు డాక్టర్ జోగి రాజేష్,గోపిరెడ్డిలు 300 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. చూపు మందగించిన 20 మందికి కళ్లజోళ్లు అందజేసి మరో 25 మందికి ఆపరేషన్ నిమిత్తం కర్లపాలెంలోని శంకర్ ఐ కేర్ ఆసుపత్రికి పంపించారు. ఈ కార్యక్రమంలో మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ కాగిత డేవిడ్ సంఘపెద్దలు నంగు పౌల్, జక్రయ్య తదితరులు ఉన్నారు.

పేదలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయుక్తం

విశాలాంధ్ర-బాపట్ల టౌన్ : నేడు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు నిరుపేదలకు దక్కకపోవడంతో ఎన్నో ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పట్నంలోని జమీగారి పేటలో డాక్టర్ అల్లా బక్షి నేతృత్వంలో మెగా ఉచిత వైద్య శిబిరము ప్రారంభించి 1500 మందికి ఉచిత వైద్య సేవలు అందించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి నిరుపేదకు ఉచిత వైద్య శిబిరం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందుకోవడం సామాన్యులకు సాధ్యం కాదని ఇటువంటి వైద్య శిబిరాలు ద్వారానే వైద్యం అందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నరేంద్ర, ఖాదర్ ఖాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

అధికారం ఉంది.. అనుమతులెందుకు...

రెవెన్యూ భూమి ఆక్రమించి బడ్డీకొట్టుల నిర్మాణం

పట్టించుకోని అధికారులు

రెవిన్యూ ప్రాంగణంలో అక్రమంగా ఏర్పాటు చేసిన బడ్డీ కొట్టులు

విశాలాంధ్ర-రేపల్లె : అధికారం ఉంటే అనుమతులెందుకు అన్న చందనంగా కొందరు పెత్తాందార్లు రెవిన్యూ అధికారుల అనుమతులు లేకుండా ఆక్రమణలకు పాల్పడ్డారు. ఇటీవల కొందరు చోటా నాయకులుగా చలామణి అవుతూ, అధికారపార్టీ నాయకుల అనుచరులమంటూ అన్ని ప్రభుత్వ శాఖల అధికారులపై పెత్తనం చెలాయిస్తున్నారు. తాజాగా రెవిన్యూ శాఖకు చెందిన తాలూకా ప్రాంగణంలో ఎటువంటి అనుమతులు తీసుకోకుండా రాత్రికి రాత్రి బడ్డీ కొట్టులను ఏర్పాటు చేసి లీజుకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. తహసీల్దార్ కార్యాలయంకు యాభై అడుగుల దూరంలో అక్రమంగా బడ్డీ కొట్టులను ఏర్పాటు చేస్తున్నా రెవెన్యూ అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రజలు విస్తుపోతున్నారు. పేదలు ప్రభుత్వ భూముల్లో చిన్న గుడిసె వేస్తే హడావిడి చేసే అధికారులు తాలూకా ప్రాంగణంలో పక్కాగా బడ్డీ కొట్టులను ఏర్పాటు చేస్తే మౌనంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తుందని ప్రజలు విమర్శిస్తున్నారు. రాజకీయ పలుకుబడి కలిగిన వ్యక్తులు అధికారంతో ఆక్రమించారా? లేకా అధికారులు అమ్ముడు పోయారా అంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు. 2012లో అప్పటి కాంగ్రెస్ పార్టీ నాయకులు తాలూకా ప్రాంగణంలో అక్రమంగా బడ్డీ కోట్టును ఏర్పాటు చేశారు. 2014లో టీడీపీ అధికారంలోనికి వచ్చిన తర్వాత 2015-16లో అప్పటి తహశీల్దార్ ఆదేశాలతో రెవెన్యూ ఇన్స్పెక్టర్ అక్రమంగా ఏర్పాటు చేసిన బడ్డీ కోట్టును మూసి వేయించి, విద్యుత్ కనెక్షన్‌ను తొలగించారు. 2018లో వైసిపి ప్రభుత్వం అధికారంలోనికి రావటంతో సదరు నాయకుడు తిరిగి బడ్డీ కొట్టును పున ప్రారంభించి టీ స్టాల్, జాబ్ వర్క్ చేసుకునేందుకు లీజుకు ఇచ్చాడు. వారిద్దరి నుంచి సదరు నాయకుడు రోజుకు రూ.100 చొప్పున అద్దె తీసుకుంటూ నెలకు రూ 6000 వసూలు చేస్తున్నాడు. ఇటీవల మరో నాయకుని అనుచరులుగా చెప్పుకుంటున్న వ్యక్తి బడ్డీ కోట్టును ఏర్పాటు చేశాడు. ఇంత జరుగుతున్నా ఎటువంటి చర్యలు లేకపోవటంతో మరిన్ని ఏర్పాటు చేసే అవ కాశం లేకపోలేదని అంటున్నారు. ఇలా ఆక్రమించకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తహశీల్దార్ వివరణ : బడ్డీ కొట్టుల ఏర్పాటు విషయంపై ఇన్‌చార్జీ తహశీల్దార్ వీరవసంతరావును వివరణ కోరగా ఎటువంటి అనుమతులు తీసుకోలేదని తెలిపారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

భక్తుల భద్రతకు పటిష్ట బందోబస్తు: ఎస్పీ

విశాలాంధ్ర - బాపట్ల : కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని సముద్ర తీరాల్లో స్నానాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానంగా సూర్యలంక బీచ్‌కు జిల్లాతో పాటు రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి లక్షల్లో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పోలీస్ శాఖ అన్నీ చర్యలు చేపట్టిందన్నారు. రామాపురం, ఓడరేవు, నిజాంపట్నం సముద్ర తీర ప్రాంతాలలో 200 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పుణ్య స్నానాలు ఆచరించడానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం సూచిక బోర్డులను ఏర్పాటుచేశామన్నారు. హ్యాండ్ మైక్‌ల ద్వారా పోలీస్ సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ భక్తుల భద్రత కోసం పనిచేస్తారన్నారు. భక్తులు పుణ్య స్థానాలు ఆచరించే సమయాలలో ఎక్కువ లోతులోకి వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా హెచ్చరిస్తూ ఉంటారని తెలిపారు. తీరం వెంబడి లైఫ్ జాకెట్లు, రోప్‌లను ధరించిన పోలీస్ సిబ్బంది, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తుల రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం పర్యవేక్షణ చేస్తామన్నారు. అదనపు ఎస్పీ మహేష్, బాపట్ల డీఎస్పీ శ్రీనివాసరావుల పర్యవేక్షణలతో నిఘా వ్యవస్థ పని చేస్తుందన్నారు. పర్యాటకులు, భక్తులు, పోలీసు శాఖ హెచ్చరికలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. యువకులు, విద్యార్థులే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో వారిపై నిఘా ఉంచామని తెలిపారు. ఆకతాయిలు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

సత్రం ఆస్తుల పరిరక్షణకు పోటాపోటీ సమావేశాలు

విశాలాంధ్ర-బాపట్ల టౌన్ : పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ దగ్గర వరకు గల 90 శాతం ఆస్తులు గరుడా చలం నాయుడుకు సంబంధించినవని జనసేన ఆరోపిస్తుండగా ఆస్తులను పరిరక్షించడానికి ప్రత్యేక కమిటీని వేసి కాపాడతామని వైసీపీ నాయకులు సమాధానం ఇస్తున్నారు. ఆదివారం ఇరు పార్టీలు వేరు వేరుగా విలేకరుల సమావేశాలు నిర్వహించి తూర్పు సత్రం ఆస్తులు పరిరక్షించాలని ఒకరు, కాపాడతామని మరొకరు ఘాటుగా సమాధానం ఇవ్వడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. జనసేన నాయకులు జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఉమ్మడి గుంటూరు జిల్లా సంయుక్త కార్యదర్శి నామం వెంకట శివన్నారాయణ మాట్లాడుతూ గరుడాచలం నాయుడు ఆస్తులను దేవాదాయ శాఖ ఎలా ధారాదత్తంగా లీజుకి ఇస్తుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ విషయమై ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షులు గాదే వెంకటేశ్వరరావు నేడు బాపట్లకు విచ్చేస్తున్నారని నాయకులు శివన్నారాయణ తెలిపారు. అదేవిధంగా వైసీపీ నాయకులు నరాల శెట్టి ప్రకాష్ మాట్లాడుతూ జనసేన పార్టీ చేసే ఆరోపణలలో వాస్తవం లేదని అన్నారు. తూర్పు సత్రం ఆస్తులను పరిరక్షించే బాధ్యత వైసీపీ ప్రభుత్వానిదేనని నరాల శెట్టి పేర్కొన్నారు. ఇది ఇలా ఉండగా సత్రం ఆస్తులు వివాదం ఏ స్థాయికి చేరుతుందోనని పట్టణంలో ప్రధాన చర్చగా మారింది.

నేడు పిన్నెల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర-మాచవరం : మండలంలోని పిన్నెల్లి గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వైసీపీ కన్వీనర్ చౌదరి సింగరయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో మంచినీరు ఇంటింటి ఇంటికి కుళాయి ఏర్పాటు చేయనున్నట్లు ఇటీవల జల స్రవంతి పథకం కింద గ్రామానికి రూ.1.63 కోట్లు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం గురజాల నియోజకవర్గ శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి శంకుస్థాపన నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా పిన్నెల్లి గ్రామంలో గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, రేపల్లె సీనియర్ సివిల్ జడ్జి తమ్మినేని వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం నిజాంపట్నం సచివాలయం - 3 వద్ద రేపల్లె మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన, విజ్ఞాన సదస్సు పాన్ ఇండియా లీగల్ అవేర్నెస్, అవుట్ రీచ్ ప్రోగ్రాం చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ చిన్న చిన్న కొట్లాటలు, తగాదాలు, ఒకరిపై ఒకరు కేసులు బనాయించుకోవడం వలన కాలం, డబ్బులు వృధా అని ఇలాంటి కేసులు ఇరు పార్టీలు రాజీ పడి లోక్ ఆధాలత్‌లో పరిష్కరించుకోవాలని చెప్పారు. రేపల్లె పరిధిలో 4 కోర్టులలో పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవాలని తెలిపారు. ప్రజలు తమ ఆర్థిక అవసరాలకు ఖాళీ ప్రామిసరి నోటు సంతకాలు, ఖాళీ చెక్కులు సంతకాలు వంటి కేసులు విషయంలో చాలా ఇబ్బందులు పడుతున్నారని ఇలాంటి విషయాలలో ప్రజలు పలు జాగ్రత్తలు వహించాలని చెప్పారు. పొలాలు, భూమి కొనుగోలు విషయంలో అగ్రిమెంట్లు చెల్లవని తప్పనిసరిగా రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎల్.జగదీశ్ కుమార్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రూపశ్రీ, తహసీల్దార్ ఎం.శిరీష, నిజాంపట్నం ఎస్ఐ రోశయ్య, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమి స్నానాలకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర - నిజాంపట్నం : కార్తీక పౌర్ణమి స్నానాలకు నిజాంపట్నం హార్బర్ సముద్ర తీరం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని బోటు యూనియన్ అధ్యక్షులు కన్నా శ్రీనివాసరావు, ఎఫ్డీవో పి.సాయి సందీప్ తెలిపారు. కార్తీక పౌర్ణమి స్నానాలకు సంబంధించి నిజాంపట్నం హార్బర్ సముద్ర తీరం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం వారు పరిశీలించి మాట్లాడారు. ఈ సారి హార్బర్ సముద్ర తీరానికి భక్తులు, పర్యాటకులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున ముందు గానే ప్రణాళికబద్ధంగా ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల హరనాథ్ బాబు, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, డివిజన్ స్థాయి అధికారుల ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఎలాంటి టికెట్లు లేవని, భక్తులు సులువుగా, స్వేచ్ఛగా తీరం వద్దకు చేరుకోవచ్చని చెప్పారు. శివలింగం దేవాలయం మార్గం పూజలు నిర్వహణకు అనువుగా ఏర్పాట్లు చేశామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు.